

TELTEL/2021/81472

# ప్రభ

దినపత్రిక

ప్రజ శ్రేయస్సే - ప్రభ లక్ష్యం

## విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా ప్రభ దినపత్రికలో బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహావంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

ప్రభ సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9642555562

ఎడిటర్ -భైరోజు కిషోర్ చారి | తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి - 4 | సంచిక- 94 | బుధవారం | 12-3 -2025 | పేజీలు- 8 | వెల రూ 5



## మారిషస్ పర్యటనలో ప్రధాని మోడీ

అత్యున్నత పురస్కారంతో సత్కారం

న్యూఢిల్లీ,
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మారిషస్ దేశ అత్యున్నత పురస్కారం దక్కింది. తమ దేశ అత్యున్నత పురస్కారం 'ది గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అండ్ కీ ఆఫ్ ది ఇండియన్ ఓషన్'ను మోడీకి ఆ దేశ ప్రధాని నవీన్ రామ్‌గులాం ప్రకటించారు. ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారత ప్రధానిగా మోడీ ఘనత సాధించారు. ప్రస్తుతం మారిషస్ పర్యటనలో ఉన్న మోడీ..

-మిగతా 3 లో

# నేను అసెంబ్లీకి వస్తున్నా అంతా సిద్ధం కండి



- అసెంబ్లీలో సమస్యలపై పోరాడుదాం
- ప్రభుత్వ తీరును సహేతుకంగా ఎండగడదాం
- బీఆర్‌ఎస్‌ఎల్పీలో సమావేశంలో కేసీఆర్ కీలక ఆదేశాలు

హైదరాబాద్,
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి , అసెంబ్లీలో విపక్షనేత కేసీఆర్ అసెంబ్లీకి రానున్నారు. నేనూ వస్తున్నా..మీరంతా రావాలి..సమస్యలపై పోరాడుదాం అని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 9:30 నిమిషాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలని సూచించారు. ప్రతిరోజూ అసెంబ్లీకి తప్పకుండా హాజరుకావాలని సూచించారు. అరగంట ముందుగా 9:30 కే అసెంబ్లీకి రావాలని పిలుపునిచ్చారు.

-మిగతా 3 లో



## నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- ఉదయం 11 గంటలకు గవర్నర్ ప్రసంగం
- అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు
- ప్రభుత్వాన్ని నిలదీసేలా బీఆర్ఎస్ సన్నద్ధం

హైదరాబాద్,
బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.
ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇకపోతే ఇప్పటికే అధికారులతో స్పీకర్ ప్రసాదరావు

-మిగతా 3 లో



## రెండు నెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

- కేంద్రమంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,
రీజినల్ రింగ్‌రోడ్డు కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డు, హైవేల కోసం గడ్కరీతో

-మిగతా 3 లో



## కొండపర్తి బ్రాండ్ కనిపించాలి

- దత్తత గ్రామంలో మంత్రి సీతక్కతో కలసి పర్యటన
- గిరిజనుల ఇంగ్లీష్ ప్రావీణ్యంపై ఆశ్చర్యం
- కొండపర్తిలో పర్యటించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ములుగు,
తాను దత్తత తీసుకున్న ములుగు జిల్లా కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోడ్డు మార్గాన చేరుకున్నారు. మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ కిషోర్ , కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా ఘన స్వాగతం పలికారు.

-మిగతా 3 లో




## ఆగమైపోతున్న తెలంగాణ రైతన్న

- నీళ్లు లేక..కరెంట్ రాక వ్యవసాయం అధోగతి
- మరోమారు కాంగ్రెస్‌పై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్,
కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమైపోతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు సరిపడా నీళ్లు లేక, విద్యుత్ కోతలతో అన్నదాత బోరున విలపిస్తున్నా పట్టించుకునే నాధులు లేరని అన్నారు. చేతికొచ్చిన పంటలు

-మిగతా 3 లో



## టన్నెల్ లోకి రోబో

110 మందితో కూడిన రెస్క్యూ టీం కూడా

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న ఆపరేషన్
- గల్లంతైన ఏడుగురి కోసం సర్చ్
- నాన్ స్టాప్ గా వస్తున్న నీటి ఊట..

నాగర్‌కర్నూలు,
ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ 18వ రోజు కొనసాగుతుంది. మంగళవారం రోబోలతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఇప్పటికే టన్నెల్‌లోకి అన్వీ రోబో బృందం వెళ్లింది. డేంజర్ జోన్‌లో రోబోలతో తవ్వే ప్రయత్నం చేశారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన రెండు చోట్ల తవ్వకాలు మొదలు పెట్టారు. కాగా.. సాయంత్రానికి రెండు మృతదేహాలు వెలికితీసే అవకాశం ఉంది. కేరళకు చెందిన క్యాడవర్ శునకాలు మృతదేహాల

-మిగతా 3 లో





## గ్రూప్-2 పరీక్షా ఫలితాలు విడుదల

హైదరాబాద్,
ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితాలు మంగళవారం సాయంత్రం విడుదలయ్యాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 783 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్

-మిగతా 3 లో

## గద్దర్ అవార్డులకు ఆహ్వానం

-13 నుంచి దరఖాస్తుల స్వీకరిస్తామని వెల్లడి



హైదరాబాద్,
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'గద్దర్ అవార్డ్స్'ను ఈ ఏడాది ఉగాది నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఎంట్రీలను ఆహ్వానించింది. అయితే అనుకోని కారణాల వలన ఈ వేడుక ఉగాది నుంచి ఏప్రిల్ మొదటివారంలో నిర్వహించబోతున్నట్లు తెలుస్తోంది.

-మిగతా 3 లో

# లెక్చరర్లకు నేడు నియామకపత్రాలు

-రవీంద్రభారతిలో అందించనున్న సీఎం రేవంత్



హైదరాబాద్,ప్రభ

జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి మార్చి 12న బుధవారం నియామక పత్రాలు ఇవ్వనున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు 1,292 మంది, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు 240 మందిని ఇటీవల టీజీపీఎస్సీ ఎంపిక చేసింది. కొత్తగా నియమితులైన లెక్చరర్లకు విద్యా శాఖ విధానాలు, బోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చి కాలేజీల్లో పోస్టింగులు ఇవ్వనున్నట్లు విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. కొత్త లెక్చరర్ల నియామకాలతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు.

# గ్రూపు-2లో సత్తా చాటిని హర్షవర్ధన్




హైదరాబాద్,ప్రభ

తెలంగాణ గ్రూప్ -2 పరీక్ష ఫలితాల్లో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 600 మార్కులకు పరీక్షలు జరగ్గా.. నారు వెంకట హర్షవర్ధన్ అనే విద్యార్థి 447.088 మార్కులతో తొలి ర్యాంకుతో మెరవగా.. వడ్లకొండ సచిన్ రెండో ర్యాంకు, బి. మనోహర్ రావు మూడో ర్యాంకులతో సత్తా చాటారు. టాప్-31 ర్యాంకుల్లో అందరూ అబ్బాయిలే ఉండటం గమనార్హం. రాష్ట్రంలో 783 గ్రూప్ -2 ఉద్యోగాల భర్తీకి గతేడాది డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించిన టీజీపీఎస్సీ.. మంగళవారం మధ్యాహ్నం ఫలితాలు విడుదల చేసిన విషయం తెలిసిందే.

# ఎన్నికలప్రక్రి, ఓటర్ల జాబితాపై ఇసి స్పందన

సమస్యలు తెలియచేయాలని పార్టీలకు సూచన




న్యూఢిల్లీ,ప్రభ

దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల పక్రియ, ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పలు సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలోనే ఇసి దిద్దుబాటు చర్యలకు దిగింది. పార్లమెంట్‌లో కూడా సోమవారం విపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రతిపక్షాలు దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా, గుర్తింపు కార్డుల అంశంపై ప్రశ్నలు లేవనెత్తాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించి.. ఎన్నికల పక్రియను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీనికి సహకరించాలంటూ రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చింది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని అన్ని జాతీయ, రాష్ట్ర పార్టీలకు ఈసీ సూచించింది. ఏప్రిల్ 30 నాటికి సలహాలను అందించాలని కోరింది. అందుకు సంబంధించి రాజకీయ పార్టీలకు సూచనలిచ్చింది. ఎన్నికల పక్రియను మరింతగా బలోపేతం చేసేందుకు ఆయా పార్టీల అధ్యక్షుడు, సీనియన్ నేతలతో చర్చలు జరిపేందుకు యోచిస్తున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. పార్టీల సీనియర్ నేతలు అందించే కీలక సూచనలను స్వీకరించనున్నట్లు తెలిపింది. పార్టీలతో సీఈవో, డీఈవో, ఈఆర్‌వోలు సమావేశం కావాలని.. ఆ సమయంలో వారు అందించే సమస్యలు, కీలక సూచనలను స్వీకరించి దానిపై నివేదిక ఏర్పాటు చేసి కమిషన్‌కు సమర్పించాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. వివిధ రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో ఈసీ స్పందించింది. ఆయా స్థాయిలో పరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తాజాగా కోరింది.

# అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

పాత కేసులో ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు అనుమతి



న్యూఢిల్లీ ప్రభ

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. మార్చి 18వ తేదీలోగా కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను అదేశించింది. కేజ్రీవాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు. దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళవారం నాడు ఢిల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్రు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' పదేళ్ల పాలనకు బీజేపీ గండికొడుతూ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో హోర్డింగ్‌ల పేరుతో ప్రజానిధుల దుర్వినియోగంపై కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# పసుపు రైతుల ఆందోళన కనిపించడం లేదా

-ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్,ప్రభ

నిజామాబాద్ పసుపు రైతుల ఆందోళనలు రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. పసుపు రైతుల ఆందోళనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. గిట్టుబాటు ధర రాక పసుపు రైతులు అల్లాడుతుంటే రేవంత్ ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. మాటలు చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి ఎందుకు ముందుకు రావడం లేదని కవిత ప్రశ్నించారు. క్వింటా పసుపు పంటకు రూ.15 వేల ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు పసుపు పంటకు కనీసం రూ. 9 వేలు రాని పరిస్థితి ఉందన్నారు. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఇది రైతులను నయవంచన చేయడమే, మోసం చేయడమేనని కవిత విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల మద్దతు ధర చెల్లిస్తూ పసుపు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు తీసుకువచ్చామని చెబుతున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కనీసం రైతులను పరామర్శించడం లేదని మండిపడ్డారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత లేకపోవడంతో రైతులకు ప్రయోజనాలు కలగడం లేదని అన్నారు. పసుపు పంటకు ధరలు పెంచుతామని, మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తామని పసుపు బోర్డు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పారని .. కానీ ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చి పసుపు రైతులను ఆదుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

# పాకిస్థాన్‌లో రైలు హైజాక్

-పాక్‌లో ప్రయాణికులతో రైలు కిడ్నాప్

-బలూచీ తీవ్రవాదుల దుశ్చర్య

-సైనిక చర్యకు దిగితే ప్రయాణికులను లేపేస్తామని హెచ్చరిక



లాహోర్,ప్రభ

పాకిస్థాన్‌లో రైలు హైజాక్ కు గురైన ఘటన కలకలం సృష్టిస్తోంది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాదులు ప్రయాణికుల రైలుపై దాడి చేశారు. వందల మందికి పైగా ప్రయాణికులను బందీలుగా తీసుకున్నామని ప్రకటించుకున్నారు. బలోచిస్థాన్‌లోని క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పెషావర్‌కు రైలు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై వేర్పాటువాదులు భారీస్థాయిలో కాల్పులు జరిపారని బలోచిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రిండ్ వెల్లడించారు. ఈ ఘటన గురించి తెలియగానే అత్యవసర చర్యలు తీసుకోవాలని స్థానిక యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. వేర్పాటువాద మిలిటెంట్ గ్రూప్ బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఈ దాడికి బాధ్యత ప్రకటించుకుంది. తాము బందీలుగా తీసుకున్నవారిలో భద్రతాసిబ్బంది కూడా ఉన్నారని తెలిపింది. పక్కా ప్లానింగ్‌తో ఆ గ్రూప్ రైల్వేట్రాక్‌ను పేల్చివేయడంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దాంతో మిలిటెంట్లు వెంటనే రైలును తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ప్రయాణికులందరినీ బంధించారు. ఈ దాడిలో ఆరుగురు మిలిటరీ సిబ్బంది మృతి చెందినట్లు బీఎల్‌ఏ వెల్లడించింది. తమపై ఏదైనా మిలిటరీ ఆపరేషన్‌కు ప్రయత్నిస్తే.. ప్రయాణికులందరినీ చంపేస్తామని బెదిరించింది. ఈ ఘటనలో రైలు డ్రైవర్ గాయపడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఘటనాస్థలానికి సహాయక, భద్రతా సిబ్బంది చేరుకున్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. బందీలను విడిపించేందుకు పాక్ భద్రతాబలగాలు యత్నిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. బలోచిస్థాన్ వేర్పాటువాదులు పాక్‌లో వరుసగా దాడులకు పాల్పడుతున్నారు. పోలీస్ స్టేషన్లు, రైల్వేలైన్లు, వాహనాలపై దాడులు చేస్తున్నారు. సాయుధులు ప్రధాన హైవేను స్తంభింపజేసి బస్సుల్లో నుంచి ప్రయాణికులను కిందకు దించి వారి గుర్తింపు కార్డులను చూసి మరీ కాల్చిచంపిన ఘటనలు చోటుచేసుకున్నాయి. బలోచ్ ప్రజల స్వయం నిర్ణయాధికారం,

పాకిస్థాన్ నుంచి ప్రత్యేక ప్రాంత ఆవిర్భావాన్ని కోరుతూ బీఎల్‌ఏ 2000 సంవత్సరం ప్రారంభం నుంచి పాక్ సైన్యంపై దాడులకు పాల్పడుతోంది. పాక్‌తో పాటు అమెరికా, యూకే దీన్ని ఉగ్ర సంస్థగా ప్రకటించాయి. బలోచిస్థాన్ ప్రాంతం నైరుతి పాకిస్థాన్, ఆగ్నేయ ఇరాన్, దక్షిణ అఎగానిస్థాన్‌లలో వ్యాపించి ఉంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా బలోచిస్థాన్ ద్వారా వెళ్తుండటం ఈ దాడులకు ప్రధాన కారణం. ఆర్థిక వృద్ధికి సిపెక్ తోడ్పడుతుందని పాకిస్థాన్ ప్రభుత్వం ఆశిస్తుండగా.. తమ ప్రాంత వనరులను కొల్లగొట్టడానికి ఇదొక ఎత్తుగడ అని, దీనివల్ల తమకు ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు భావిస్తున్నారు. సిపెక్‌కు సంబంధించిన ప్రాజెక్టులు, సిబ్బందిపై ముఖ్యంగా చైనీయులపై ఇటీవల దాడులు అధికమయ్యాయి. బలోచ్ వేర్పాటువాదాన్ని పాకిస్థాన్ ఉక్కుపాదంతో అణచివేస్తుండటంతో పరిస్థితులు మరింత జటిలంగా మారుతున్నాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ లెక్కల ప్రకారం 2011 నుంచి దాదాపు పదివేల మంది బలోచ్ ప్రజలు అదృశ్యమయ్యారు.

# నేను అసెంబ్లీకి వస్తున్నా అంతా సిద్ధం కండి

(మొదటి తరువాయి)

మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశాల్లో మాట్లాడే అంశాలపై పూర్తిగా అధ్యయనం చేసి మాట్లాడాలని సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశర చేశారు. 'హామీల అమల్లో వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, సృష్టించిన ఆస్తుల గురించి సుదీర్ఘంగా వివరించాలి. పదేళ్లలో బీఆర్ఎస్ నాలుగు లక్షల కోట్ల అప్పు చేస్తే కాంగ్రెస్ 14 నెలల్లోనే లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసింది. అప్పుల విషయంలో కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలి. భారీగా అప్పులు చేసినా హామీలు అమలు చేయడం లేదు. రైతుబంధు, సాగునీరు ఇవ్వకుండా రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. గొర్రెల పెంపకం.. చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలి. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమౌతున్న తీరుపై మాట్లాడాలి. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్స్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలి. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కొట్లాడాలి. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలి. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్ లు విడుదలచేయక పోవడం, వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమస్యలు ఎండగట్టాలి. దళిత బంధును నిలిపివేయడం పట్ల ప్రశ్నించాలి..' అని మాజీ సీఎం కేసీఆర్ సమావేశంలో తెలిపారు.

# ఆగమైపోతున్న తెలంగాణ రైతన్న

(మొదటి తరువాయి)

ఎండిపోతుంటే రైతన్న తల్లడిల్లిపోతున్నాడు. ఏం చేయాలో దిక్కుతోచక కొందరు అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. మరికొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. అన్నదాతల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కేటీఆర్ అన్నారు. అలంపూర్ నుండి ఆదిలాబాద్ వరకు అశ్వారావుపేట నుండి జహీరాబాద్ వరకు వ్యవసాయం తిరోగమనం లో ఉందన్నారు. సాగునీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయ్.. రైతుల గుండెలు మండిపోతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువును తెచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో నడి ఎండకాలంలోనూ చెరువులు మత్తళ్లు దుంకాయని కేటీఆర్ గుర్తు చేశారు. నేడు అదే చెరువులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని మండిపడ్డారు. నాడు కాలువల నిండా నీళ్లతో ఏడాదికి రెండు పంటలు పండించుకునేందుకు కేసీఆర్ అండగా నిలిస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పడావుబెట్టి, నీళ్లను ఆంధ్రాకు వదిలి పంటలను ఎండబెడుతుందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్



హయాంలో సమయానికి రైతుబంధు, 24 గంటల ఉచిత కరంటు, సాగునీళ్లు, విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోళ్లతో రైతు కంటినిండా నిద్ర, కడుపు నిండా సంతోషంగా ఉన్నాడని కేటీఆర్ గుర్తు చేశారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా రాదు, సాగునీళ్లు ఇవ్వరు, కరంటు ఇవ్వరు, విత్తనాలు దొరకవు, ఎరువులు ఉండవు, అన్ని గండాలు దాటుకుని పంటలు పండిస్తే కొనుగోళ్లు ఉండవు అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ అనుకూల విధానాలతో పండగలా వ్యవసాయం ఉండే అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాతపై కక్షగట్టి వ్యవసాయాన్ని ఆగంపట్టించారని మండిపడ్డారు.

# టన్నెల్ లోకి రోబో

(మొదటి తరువాయి)

ఆనవాళ్లు పసిగట్టాయి. దాంతో ఆ ప్రాంతంలో తవ్వితే ఒకరి మృతదేహం బయటకు తీశారు. అతి కష్టం మీద మరో ఐదడుగులు తవ్వారు. ఇంజనీర్ ఆచూకీని కనుగొన్న ప్రాంతానికి కొంచెం అటు ఇటుగా మరో ముగ్గురు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మరో ఇద్దరి జాడ లభించే అవకాశం ఉంది. మిగిలిన వారు సొరంగం చిట్ట చివరి భాగం దగ్గర టీబీఎం కట్టర్ సమీపంలో చిక్కుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం టన్నెల్‌లో టీబీఎం మిషన్ కట్టింగ్, డీ వాటరింగ్ కొనసాగుతుంది. శ్రీశైలం ఎడమ కాలువ ప్రాజెక్టు టన్నెల్ నిర్మాణ సమయంలో 8 మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టన్నెల్‌లో గౌరావ్ పెనిట్రేటింగ్ రాడార్ , క్యాడవర్ డాగ్స్ సాయంతో తవ్వకాలు కొనసాగుతున్నాయి.



రాడార్, శునకాలు గుర్తించిన ప్రదేశాలను డీ1, డీ2, డీ3 ప్రాంతాలుగా విభజించి అక్కడ తవ్వకాలు చేపట్టారు అధికారులు. ఆదివారం నాడు డీ2 ప్రాంతంలో తవ్వకాలు జరిపిన రెస్క్యూ టీమ్స్ ఓ ఇంజనీర్ మృతదేహాన్ని వెలికితీశాయి. రెస్క్యూ ఆపరేషన్ కు అడ్డుపడుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ కట్టింగ్, నీటి తొలగింపు పనులు కూడా నిరంతరం జరుగుతున్నాయి. కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎంతమాత్రం అలసిపోకుండా, బృందాలు ఎప్పటికప్పుడు తమపనిని చురుకుగా కొనసాగిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ , రెస్క్యూ టీమ్స్, పోలీసు విభాగం, ఫోరెన్సిక్, వైద్య బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

# గ్రూప్-2 పరీక్షా ఫలితాలు విడుదల




(మొదటి తరువాయి)

విడుదలకాగా, 5 లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పరీక్షలకు 46 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే సగానికి సగం మంది మాత్రమే గ్రూప్-2 పరీక్షలను రాశారు. 2024 డిసెంబర్ 15, 16న పరీక్షలు నిర్వహించారు.

# గద్దర్ అవార్డులకు ఆహ్వానం

(మొదటి తరువాయి)

దీనికి సంబంధించి ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తాజాగా స్పష్టత ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సంవత్సరం (2014) నుంచి 2013 వరకు ఒక్కో సినిమాకు ఉత్తమ చలన చిత్రం అవార్డును ఇవ్వబోతున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈ అవార్డుల విధివిధానాలను ఇటీవల ఖరారు చేసిన ప్రభుత్వం, మార్చి 13 నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. వేడుకలలో సినిమా నటులతో పాటు దర్శకులు, సాంకేతిక నిపుణులతో పాటు ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక విద్యా, సామాజిక ఔచిత్యం, జాతీయ సమైక్యతను ప్రోత్సహించే చిత్రాలు, బాలల సినిమాలు, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర ఆధారిత చిత్రాల విభాగాల్లో ప్రభుత్వం పురస్కారాలు ఇవ్వనుంది. ఇవే కాకుండా తొలి ఫీచర్ ఫిల్మ్, యానిమేషన్ ఫిల్మ్, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్ వంటి విభాగాల్లోనూ ఈ అవార్డులను ప్రదానం చేయాలని భావిస్తోంది. తెలుగు సినిమాపై పుస్తకాలు, విశ్లేషణలు రాసిన వారికి, నటీనటులు, సాంకేతిక నిపుణులకు కూడా ఈ గౌరవాన్ని అందించనున్నారు. అలాగే తెలంగాణ సినిమా రంగంలో అసాధారణ సేవలు అందించిన పైడి జయరాజ్, కాంతారావు పేర్లతో కూడా ప్రత్యేక పురస్కారాలను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తుంది. తెలుగు సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగు సినిమాపై పుస్తకాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకూ ఈ అవార్డును ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పైడి జయరాజ్, కాంతారావు, ఎం.ప్రభాకర్‌రెడ్డి పేర్లతో అవార్డులు కొనసాగించాలని నిర్ణయించింది.

## మారిషస్ పర్యటనలో ప్రధాని మోడీ

(మొదటి తరువాయి)

ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం, ఆయన సతీమణి వీణా రామ్‌గులాంలకు 'ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ)' కార్డులు ప్రకటించారు. పర్యటనలో భాగంగా అక్కడున్న భారతీయులతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజున మారిషస్‌కి వచ్చాను. అప్పటికీ హోలీకి పది రోజులే ఉంది. ఈ సారి హోలీ రంగులను నాతో పాటు భారత్‌కు తీసుకెళ్తా. ఈ ప్రాంతానికి వస్తే నా సొంత ప్రదేశంలా అనుభూతి కలుగుతుంది. మనమంతా ఒకే కుటుంబం అంటూ ప్రసంగించారు. అనంతరం.. తనను అత్యుత్తమ పురస్కారంతో సత్కరించిన మారిషస్ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

## నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

(మొదటి తరువాయి)

సమీక్షించారు. పలు సూచనలు చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది.. తొలిరోజు ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ జిజష్టుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. 13న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉంటుంది. 14న హోలీ సెలవు కారణంగా అసెంబ్లీకి కూడా సెలవు ప్రకటించారు. 15న గవర్ర్ ప్రసంగానికి సిఎం రేవంత్ సమాధానం ఇస్తారు. ఎస్సీ వర్గీకరణ, బిసి బిల్లులతో పాటు అంశాలు చర్చకు రానున్నాయి. కెసిఆర్ తొలిరోజు హాజరవుతారని ఇప్పటికే కెటిఆర్ సమాచారం ఇచ్చారు. అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఇప్పటికే అన్ని శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, మంత్రుల సమావేశం జరిగింది. ఆయా శాఖలకు బడ్జెట్ లో నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలు సమర్పించారు. ఈనెల 19 లేదా 20న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. ఈసారి మూడు లక్షల 20 వేల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టేఅవకాశం ఉంది. మార్చి 29 వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగించనున్నట్లు సమాచారం. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహం పై ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ పై చర్చ లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని నిర్ణయించారు. ఆరు గ్యారెంటీలకు బ్జడెట్ కేటాయింపులపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా చర్చలో పాల్గొనాలని కేసీఆర్ సూచించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటన పై ప్రభుత్వ తప్పిదం ఉందంటూ ఎత్తి చూపాలన్నారు. కాళేశ్వరం రిపేర్ చేయక పోవడంతోనే పంటలు ఎండుతున్నాయి అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. రాష్ట్రం లోని వివిధ అంశాలపై వాయిదా తీర్మానాలు ఇచ్చి.. వాటిపై చర్చ కు గట్టిగా పట్టు పట్టాలని ఎమ్మెల్యే లకు కేసీఆర్ సూచించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సందర్భంగా రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని సి.ఎస్ అన్నారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సి.ఎస్ పేర్కొన్నారు.

## కొండపర్తి బ్రాండ్ కనిపించాలి

(మొదటి తరువాయి)

ఆదివాసీలు వారి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కుమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ అభివృద్ధి నిమిత్తం రూ. కోటి 50 లక్షల విలువైన పనులు ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అగన్వాడీ కేంద్రంలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. మహిళల కొరకు మిర్చి యూనిట్, మసాల, పసుపు, పిండి యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ మాట్లాడుతూ.. 'ఆదివాసీలు వెనకబడి ఉన్నారు కాబట్టి అధికారులందరూ కలిసి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. ఇక్కడ పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడం చాలా ఆనందం అనిపించింది. ఈ కొండపర్తి గ్రామాన్ని దేశంలో రోల్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలి. నేను ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చాను. మా గ్రామం కూడా నా చిన్నప్పుడు కొండపర్తిలానే ఉండేది. కొండపర్తిలో తయారుచేసే మసాలా, కారం, పసుపు ఒక ప్రత్యేక బ్రాండ్ లు గా నిలవాలని ఆయన పేర్కొన్నారు.

## రెండు నెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

(మొదటి తరువాయి)

సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సంగారెడ్డి - భువనగిరి - చౌటుప్పల్ వరకు ఆర్‌ఆర్‌ఆర్ టెండర్ల ప్రక్రియ పూర్తయింది. దాదాపు 95శాతం భూ సేకరణ కూడా పూర్తయింది. రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు' అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

# ఐటీసీ బంగారు భవిష్యత్తు

# అతి నీరు పేద సహాయక కార్యక్రమం







**బూర్గంపాడు: మార్చి 11 ( ప్రభ):**
మండల పరిధిలోని సార పాక ఐటీసీ కళా భారతిలో నిర్వహించిన ఐటీసీ బంగారు భవిష్యత్తు అతి నిరుపేద సహాయ కార్యక్రమానికి ముఖ్యతిధులు గా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ...ఐ టి సి వారు నిర్వహిస్తున్న బంగారు భవిష్యత్తు అతి నిరుపేద సహాయక కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషకరమని నిరుపేద మహిళలకు మెలకువలను గుర్తించి వారికి అనేక రంగాలలో ట్రైనింగ్ ఇప్పించి వారు ఆర్థికంగా నిలదొక్కుకోడానికి పలు రకాల కార్యక్రమాలను నిర్వహించి ఆర్థికంగా మెరుగుపరిచేందుకు తోడ్పడుతున్న ఐటిసి వారికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు ఐటిసి వారు వర్షాకాలంలో వచ్చే వరదల కారణంగా అనేక గ్రామాలు మునిగిపోతే అక్కడ ప్రజలను పునరావసాలకు తరలించి వేల మందికి భోజనాలు ఏర్పాటు చేసి అనేక సేవలు అందించరాని ఐ టి సి, సి ఎస్ ఆర్ నిధులతో అనేక గ్రామాల అభివృద్ధికి తోడ్పడ్డారని బంధన్ ఐటిసి వారి సేవలు ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలిచాయని భర్త లేని కుటుంబాల మహిళలకు వారి రెక్కల పై వారు నిలబడె భరోసా ఐటిసి వారు కల్పించారని తెలియజేసిన పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమంలో ఐటీసీ అధికారులు, బూర్గంపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఖేడ్ లో జోరుగా రేషన్ బియ్యం అక్రమ దందా

**-కాసుల వర్షం కురిపిస్తున్న రేషన్ బియ్యం**
**-ఎక్సెల్ వాహనాలపై తరలింపు**





**నారాయణఖేడ్,మార్చ్ 11 ప్రభ:**
నారాయణఖేడ్ పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా బియ్యం దుకాణాల యజమానులకు రేషన్ బియ్యం కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఖేడ్ పట్టణంలో 20 కి పైగా బియ్యం,జొన్నలు, పప్పు దినుసులు అమ్మే దుకాణాలు ఉన్నాయి. అవన్ని పేరుకు మాత్రమే సన్న బియ్యం అమ్మే దుకాణాలు అందులో జరిగే వ్యాపారం మాత్రం రేషన్ బియ్యానిది. పట్టణంలోని కొన్ని దుకాణాల యజమానులు ప్రతిరోజు 50 నుండి 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి రైస్ మిల్ లకు తరలిస్తున్నారు. ఈ మధ్యకాలంలో గ్రామాల నుండి చిన్న వ్యాపారులు ఎక్సెల్ వాహనాలపై రేషన్ బియ్యం ఖేడ్ లోని బియ్యం దుకాణాలకు తీసుకొచ్చి అమ్ముతున్నారు. ఒక్కొక్క ఎక్సెల్ వాహనంపై 2 క్వింటాళ్లకు పైగా బియ్యం తరలిస్తున్నారు. బియ్యం దుకాణాల యజమానులు అందరు కూడ దుకాణానికి కాస్త దూరంలో రేషన్ బియ్యం నిల్వచేయడానికి షెట్టర్లు లేదా గదులను అద్దెకు తీసుకుంటున్నారు. ముందర సన్నబియ్యం లోపల రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం సరఫరా చెయ్యడం వల్ల సచ్చినోడి పెళ్ళికి వచ్చిందే కట్నంగా రేషన్ బియ్యం కిలో 20 రూపాయలకు విక్రయిస్తున్నారు. దుకాణాల యజమానులు అట్టి బియ్యం కిలో 30 రూపాయల చొప్పున రైస్ మిల్లర్లకు విక్రయిస్తూ లక్షలు సంంపాదిస్తున్నారు. కొంతమంది బియ్యం దుకాణాల యజమానులు మాకు ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయి మాకు ఎవ్వరు ఏమి చేయలేరు అంటూ బహిరంగగానే, దర్జాగా రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేసే దుకాణాలు అన్ని ప్రధాన రహదారుల పక్కనే ఉన్న ఏ ఒక్క శాఖ అధికారి ఒక్కరోజు కూడ తనిఖీ చేయకపోవడం విడ్డూరం. అప్పుడప్పుడు విజిలెన్స్ అధికారులు బియ్యం దుకాణాలపై ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తే


# తగిన మూల్యం చెల్లించక తప్పదు...

**భద్రాచలం: మార్చి 11 ( ప్రభ):**
త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టబద్ధత చేశాకే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని అంబేద్కర్ సెంటర్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొక్క వినేష్ మాదిగ అధ్యక్షతన నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. నిరహర దీక్షను కార్యక్రమాన్ని దీక్షను మాజీ MSF నాయకులు నల్లకట్ల శివ మాదిగ గారు భద్రాచలం V5 రిపోర్టర్ పూలమాలవేసి ప్రారంభించారు వేల్పుల సూర్య వాణి మాదిగ MRPS జిల్లా అధ్యక్షురాలు తెల్లం సమ్మక్క MSP జిల్లా అధికార ప్రతినిధి ముఖ్యఅతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణలో మాదిగల మాదిగ ఉప కులాల సామాజిక కుల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాల నుండి అలుపెరుగని పోరాటాలు చేయడం జరుగుతుందని, అందులో భాగమే ఎస్సీ వర్గీకరణ పోరాటమని అన్నారు. ఆగస్టు1వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత చేసి అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి పూర్తి స్థాయిలో అమలు పరచాలని డిమాండ్ చేశారు. లేనియెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాదిగల మాదిగ ఉపకులాలు ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడం వల్ల మాదిగ మాదిగ ఉప కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. మాలలకు తలొగ్గి సుప్రీంకోర్టు తీర్పును నీరు కార్చడం వల్ల మాదిగలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. కమిటీల, కమిషన్ల పేర్లతో వర్గీకరణ బిల్లును కాలయాపన చేయడం సరి కాదని అన్నారు. నిండు అసెంబ్లీలో సుప్రీంకోర్టు తీర్పు కట్టుబడి ఉద్యోగ నియామకాలు చేపడతామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి నేడు ఆచరణలో అమలు చేయకపోవడం విడ్డూరమని అన్నారు. రాష్ట్రంలో జరగబోయే ఉద్యోగ నియామకాలను ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టబద్ధత చేసిన తర్వాతే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 అదేవిధంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తదితర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. 12వ తేదీన బుధవారం నుండి ప్రారంభమయ్యే తెలంగాణ శాసనసభ సమావేశాల్లో తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టబద్ధత చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెడతామని హెచ్చరించారు. ఈ దీక్షను 1వ రోజు ఆవులూరు సత్యనారాయణ మాదిగ స్థానిక భద్రాచలం అడ్వొకేట్ గారు నిమ్మరసం ఇచ్చి విరమించినారుఈ కార్యక్రమం MRPS మహిళా మండలా అధ్యక్షురాలు గుండే సుహాసిని మాదిగ మహిళా మండలా ఉపాధ్యక్షురాలు తిప్పనపల్లి సమత మాదిగ VHPS మిట్టపెల్లి నరేందర్ MRPS మాదిగ సీనియర్ నాయకులు బొక్కా రాంబాబు మాదిగ కనుకు శ్రీనివాస్ మాదిగ తోకల దుర్గప్రసద్ మాదిగ బొక్కా పున్నయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.




# సరస్వతి పుత్రుడు మనోహర్

**-6 ఉద్యోగాలు సాధించిన ఘనుడు**



**నారాయణఖేడ్,మార్చ్ 11ప్రభ:**
ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి కొందరు జీవితకాలం కష్టపడుతూనే ఉంటారు. ఉద్యోగం సంపాదించడానికి లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగులు తీసుకున్న కొందరు ఉద్యోగాలు సాధించలేరు. అందుకు భిన్నంగా సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్ గ్రామానికి చెందిన బిరాధర్ మనోహర్ తండ్రి పండరినాథ్ పాటిల్ అనే వ్యక్తి 37 ఏళ్లకే ఇప్పటివరకు 6 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. PGT, TGT,స్కూల్ అసిస్టెంట్,2 మార్లు గ్రూప్-2, సోమవారం వెలువడిన గ్రూప్-2 ఫలితాలలో జోన్ మొదటి ర్యాంక్ మరియు రాష్ట్ర 3వ ర్యాంక్ సాధించారు. జూనియర్ లెక్చరర్ గా విధులలో చేరబోతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ఘోర అవమానం




**అశ్వాపురం: మార్చి 11 ( ప్రభ):**
మండల పరిధిలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఉన్న గాంధీ విగ్రహాన్ని తీసివేసి ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల లో ఓ మూలకి పడ వేసిన గుర్తు తెలియని వ్యక్తులు. విగ్రహాన్ని తొలగించిన వారిని చట్ట పరంగా శిక్షించాలని, మహాత్మా గాంధీ విగ్రహాన్ని పున ప్రతిష్ట చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, కళ్లెం ఇంద్రారెడ్డి, నెల్లిపాక సాకార సంఘ అధ్యక్షుడు తుక్కని మధుసూదన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముసుకు శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ సర్పంచ్ కమటం వెంకటేశ్వరరావు,టి జె ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కర్ణాకర్ రెడ్డి, టీజేఎస్ మండల అధ్యక్షుడు సుర కంటి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొండ బత్తుల ఉపేందర్, కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, మారోజు కృష్ణమాచారి, రామిడి సాంబిరెడ్డి, పశువుల వెంకటేష్,ఆర్యవైశ్య సంఘం గ్రామ నాయకుడు కాకర్ల రామారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



**నారాయణఖేడ్,మార్చ్ 11 ప్రభ:**
నారాయణఖేడ్ మండలం అల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మల్పరేగడి తండకు చెందిన రాజుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ,24000ల చెక్కును మంగళవారం ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ జిల్లా నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి లబ్దిదారులకు అందజేశారు. ఆయన తోపాటు నగేష్ రెడ్డి,రాంశెట్టి,తదితరులు ఉన్నారు.

## 131 డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్యోతి పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ మర్చి 11,ప్రభ:**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 131 డివిజన్ కుత్బుల్లాపూర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్యోతి గారి పుట్టిన రోజు సందర్భంగా ఈరోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హన్మంతన్న శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో 131 డివిజన్ అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు మమత పాల్గొన్నారు .

# సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం

**నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**



**కుత్బుల్లాపూర్ మర్చి ప్రభ:**
నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాచుపల్లి 2వ డివిజన్ ప్రగతి నగర్ ప్రెసిడెంట్ సురగణి వీరబాబు పెద్దనాన్న వీరాస్వామి గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేదు అని తెలుసుకున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 4,00,000/- ల సీఎం సహాయనిధి - ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 4,00,000/- (నాలుగు లక్షల రూపాయలు ) సీఎంఆర్ఎఫ్ - ఎల్ ఒ సి మంజూరి పత్రాలను వీరబాబు కి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గారు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ 1వ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజి రెడ్డి, 126 డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పద్మ రావు , ప్రశాంత్ రెడ్డి, షఫీ, సురేందర్, శివ కుమార్, మల్లేష్, మొహ్మద్ పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే మన ప్రభుత్వ లక్ష్యం

**కూన శ్రీశైలం గౌడ్**





**కుత్బుల్లాపూర్ మర్చి ప్రభ:**
షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో భాగంగా నియోజకవర్గం ప్రజల స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలు,వినతి పత్రాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అన్నారు..నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పడుతానన్నారు. ప్రజల స్థానిక సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# త్రిపుర లాండ్ మార్క్ కాలనీ సమస్యల పరిష్కారం కోసం పర్యటించిన నర్సారెడ్డి భూపతిరెడ్డి





**కుత్బుల్లాపూర్ మర్చి 11,ప్రభ :**
,దుండిగల్ మున్సిపాలిటీ, బౌరంపేట్ లోని త్రిపుర లాండ్ మార్క్ కాలనీ వాసులు కాలనీలోని సమస్యల పరిష్కారం కోసం టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డిని సంప్రదించగా నేడు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ ఇరిగేషన్ అధికారులతో కలిసి కాలనీ లో పర్యటించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు బాల్ రెడ్డి,ఉపాధ్యక్షులు నాగేశ్వర రావు,ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ,సభ్యులు ఆయిలయ్య గౌడ్,రంగారెడ్డి,తార,అనీల్,సిద్ధు బౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి,ఓబిసి సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ భరత్ గౌడ్,ఎస్సీ సెల్ ఛైర్మన్ చింతకింది సురేశ్,ప్రధాన కార్యదర్శి అర్కల విజయ్ గౌడ్,బండ్ల విజయ్ కుమార్,కృష్ణ రెడ్డి,మిద్దెల సీతారాం రెడ్డి, మరియు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి






**-కొలుకుల శశికళ జగన్**

**జగద్గిరిగుట్ట మర్చి ప్రభ:**
మహిళలు రాజకీయంగా ,ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని జగద్గిరిగుట్ట డివిజన్ బి ఆర్ ఎస్ మహిళా నాయకురాలు కొలుకుల శశికళ జగన్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి లోని కన్యక పరమేశ్వరి ఆలయంలోని కమిటీ హాల్ లో స్థానిక మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఆమె సన్మానించారు. అనంతరం కొలుకుల శశికళ జగన్ మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో పోటీపడాలన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు అన్ని రంగాలలో రాణించడానికి ప్రోత్సహించింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీసీ, ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీదేవి, ఇండియన్ బ్యాంక్ మేనేజర్,ఉషారాణి, టీజీ బ్యాంక్. రఘునందన్ రావు,హరిప్రియ, Co కిషోర్ కుమార్, డివిజన్. మహిళ నాయకురాలు,వరమ్మ,సువర్ణ, కొలుకుల జ్యోతి,శాంతి హైమావతి,పద్మ,మంజుల, శోభారాణి, ఝాన్సీ,మాధవి, సుజాతలక్ష్మి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ కాలనీ లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటాం

**-గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి మర్చి 1,ప్రభ:**
గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీ వాసులు తో సమావేశమై ఎక్కడ ఉన్నా సమస్యలు అడిగి తెలుసుకునీ నెలకొన్న సమస్యలపై సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా తమ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్ లైన్ నిర్మాణము పనులను పూర్తి చేయాలని, మంచి నీటి వసతిని మెరుగుపర్చాలని, విధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడలని,పారిశుధ్యం పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ని కోరారు. దీంతో అక్కడే ఉన్న అధికారులకు ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. అందుకు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం తమ కాలనీలో ఉన్న పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్, క్రీడా ప్రాంగణం, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరోటర్ గంగాధర్ రెడ్డి ని కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ లో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్ లైన్ పనులను రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామని,మంజీర మంచీ నీటి వసతిని మెరుగుపరుస్తామని,దశల వారిగా అన్ని పనులు పూర్తి చేసి టీఎన్జీవోస్ కాలనీ లో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని తెలియచేసారు. పెరుగుతున్న జనాభా దృశ్య భూగర్భ డ్రెయినేజీ పైప్ లైన్ దయా పెంచి లెవల్స్ తో అనుసంధానం చేస్తూ ఒక్క కాలనీ నుండి మరొక కాలనీ కి మధ్యన ఇబ్బందులు తల్లెత్తకుండ పనులు ప్రణాళిక బద్ధంగా అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్ రెడ్డి,డిఈ విసాలాక్షి, జి.హెచ్.ఎం.సి అధికారులు,డివిజన్ నాయకులు, టీఎన్జీవోస్ కాలనీ కమిటీ సభ్యులు,కాలనీ వాసులు, సీనియర్ నాయకులు స్థానిక నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శివాలయంలో దుశ్చర్యకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలి

**-శాంతియుతంగా హిందూ సంఘాలు,బిజెపి నాయకుల ఆధ్వర్యంలో నిరసన**

**-బిజెపి నాయకులను ముందస్తు అరెస్టు చేసిన జగద్గిరిగుట్ట పోలీసులు**

**-బిజెపి కార్యకర్తలను పరామర్శించిన మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్**



**కుత్బుల్లాపూర్ మర్చి 11,ప్రభ:**
గాంధీనగర్ శివాలయంలో కొందరు గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడుతూ అక్కడ చేసినటువంటి దుశ్చర్యకు వ్యతిరేకంగా వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించలని శాంతియుతంగా హిందూ సంఘాలు,బిజెపి నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలుపడానికి వెళ్లగా వారిని నిర్మానుషంగా అరెస్టు చేసి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది అని బిజెపి నాయకులు తెలిపారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వెంటనే మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీజేవైఎం నాయకులు కుమార్ యాదవ్ 126వ డివిజన్ అధ్యక్షుడు పున్నారెడ్డి యువ నాయకులు సిరుసాని మహేందర్, కార్యకర్తల ను పరామర్శించి సంఘీభావం తెలిపారు ,ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరువృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియజేస్తూ, లేదంటే అందరం కలిసి న్యాయం జరిగే వరకు పోరాడుతామని వారు తెలియజేశారు.

# మౌలికవసతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..





**శేరిలింగంపల్లి మర్చి 11,ప్రభ:**
మాదాపూర్ డివిజన్ పరిధిలోని జైన్ అపార్ట్మెంట్ మై స్కేప్ అపార్ట్మెంట్ నందు స్థానికంగా నెలకొన్న సమస్యలను జి.హేచ్.ఎం.సి ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ అధికారులు కాలనీ సభ్యులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ,బస్తీలో ప్రజలకు మెరుగైన మౌళికవసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ,ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, డివిజన్ పరిధిలో మంజూరైన అభివృధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేల కృషి చేస్తామని మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని జైన్ అపార్ట్మెంట్ మరియు మై స్కేప్ అపార్ట్మెంట్ నందు స్థానికంగా నెలకొన్న సమస్యలను జి.హేచ్.ఎం.సి ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ అధికారులు డీ.ఈ,ఏ.ఈ ట్రాఫిక్ సిబ్బంది/కాలనీ సభ్యులతో కలిసి పర్యటించారు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు పరిశీలించారు మరియు కాలనీలో నూతనంగా నిర్మించాల్సిన సీసీ రోడ్డు పనులను స్థానికులు జగదీశ్వర్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు.

# ఆయకట్టు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి





**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్...**

**పాపన్నపేట, 11,ప్రభ :** ఇరిగేషన్ ఆయకట్టు ద్వారా నీటి వనరులను సమర్థవంతంగా పంట పొలాలకు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు మంగళవారం పాపన్నపేట మండలంలోని పొడిచన్ పల్లి, శానాయిపల్లి,ఎల్లాపూర్, గ్రామాలలో ఎఫ్ఎన్ కెనాల్ ఆయకట్టు చివరి నీటిపారుదల వ్యవస్థను కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు ఈ సందర్భంగా, జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా వరి పంటలకు నీటి వనరులు కెనాల్ కాలువలు, అయ ప్రాంతాలలో ప్రస్తుత యాసంగి రైతులు సాగు చేస్తున్న పరీక్షేత్రాలను పరిశీలించారు బోరుబావుల కింద సాగవుతున్న వరి పైరు ఏ స్థితిలో ఉంది, సాగునీటి లభ్యత ఏ మేరకు అందుబాటులో ఉంది అన్న అంశాలను పరిశీలన జరిపారు వ్యవసాయ అధికారులను, సంబంధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు మిగతా విస్తీర్ణంలో వరి పంట దిగుబడులు చేతికి వచ్చేందుకు ఇంకా ఎంత సమయం పడుతుంది ఇంకా ఎన్ని తాడులు నీరు అవసరం అవుతుంది గ తేడాది ఆ సంఘంలో పంట పరిస్థితి ఎలా ఉండింది ఏ రకం దాన్యం సాగు చేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు ఈ కార్యక్రమంలో, ఇరిగేషన్ ఏఈ విజయ్ కుమార్ సంబంధిత అధికారులు రైతులు పాల్గొన్నారు

# కుక్కడం గ్రామంలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి.

**-సిపిఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్.**

**మాడుగులపల్లి/ 11,ప్రభ :** మాడుగులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు సిపిఎం ప్రజా పోరుబాట కార్యక్రమంలో భాగంగా మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామంలో సమస్యల అధ్యయనం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కడం గ్రామంలో ప్రధాన వీధులలో డ్రైనేజీ సమస్య సరిగా లేకపోవడం వలన డ్రైనేజీ నీరు రోడ్డుపై పారుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రభుత్వ అధికారులు వచ్చి చూసి ఫోటోలు తీసుకోవడం వరకే పరిమితం అవుతున్నారు తప్ప సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయడం లేదన్నారు. దీనివలన డ్రైనేజీ సరిగ్గా లేకపోవడం తోటి మురుగునీరు రోడ్డుపై పారడంతో ఇళ్ళ ముందుకు వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటివలన విషజ్వరాలు ప్రబలి ప్రజల ఆరోగ్యాలు దెబ్బతినే



పరిస్థితి ఉందన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి రోగాల బారిన పడి ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు వస్తున్నారు,పోతున్నారు తప్ప మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేరు మా సమస్య ఎవరు పరిష్కరించడం లేదు చాలా రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్న కూడా ఎవరు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు పోలెబోయిన వరలక్ష్మీ,మండల కమిటీ సభ్యులు పతాని శ్రీను, అయితగాని విష్ణు, మునాగల నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ముమ్మురంగా ఎల్ఆర్ ఎస్, క్రమబద్దీకరణ ప్రక్రియ ను ఉపయోగించుకోండి







**-అర్హులైన ప్రతి కస్టమర్ 25% సబ్సిడీ వినియోగించుకోవాలని**

**-జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

**మహబూబాబాద్ జిల్లా 11,ప్రభ :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన లే అవుట్ల క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్ పథకం 25% సబ్సిడీ, జిల్లాలో వేగంగా కొనసాగుతుందని, ఇంకా అర్హులైన లబ్ధిదారులు వెంటనే వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ మంగళవారం తెలిపారు,జిల్లాలోని మరిపెడ, మహబూబాబాద్, మున్సిపల్ పరిధిలలో ఎల్ ఆర్ ఎస్, ఫీజు చెల్లించిన లబ్ధిదారులకు ప్రోసిడింగ్ కాపీని మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, నోముల రవీందర్, అందజేశారు,తొర్రూరు, డోర్నకల్, గ్రామపంచాయతీ పరిధి లలో ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లించి లబ్ధిదారులు ప్రోసిడింగ్ కాపీలను పొందుతున్నారు, మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, డోర్నకల్ మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్, వివిధ అభివృద్ధి పనులు, కేజీవిభి పాఠశాల ను తనిఖీ చేశారు,జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, అన్ని వసతి గృహాలలో క్రమం తప్పకుండా మెనూ ప్రకారం డైట్ను అందించాలని, సూచించారు,ఇప్పటికే ఎల్ఆర్ఎస్ కట్టిన వారికి ప్రత్యేక హెల్ప్ డెస్క్ ల ద్వారా సమాచారం అందించి ఈ యొక్క పథకం వినియోగించుకోవడానికి తెలియపరచడం జరుగుతుందని తెలిపారు, క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీ, మున్సిపల్ పరిధిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఎల్ఆర్ఎస్ పథకం సబ్సిడీని వినియోగించుకోవాలని వారు కోరారు

# వీధి దీపాలు ఏర్పాటు చేయాలి సిపిఎం ఆధ్వర్యంలో వినతి

**మిర్యాలగూడ 11,ప్రభ :** పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ మాట్లాడుతూ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ లో వెంకటేశ్వర దేవాలయం ఆర్చి నుండి ఎస్పీ ఫంక్షన్ హాల్ వరకు నూతనంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేశారని వాటికి విద్యుత్ దీపాలు



అమర్చలేదన్నారు నిత్యం వందల మంది ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తున్నారని రాత్రి వేళలో విద్యుత్ దీపాలు లేక అందాకారంగా ఉంటుందని చెప్పారు. మహిళలు వృద్ధులు పిల్లలు రాత్రి వేళలో ఈ రోడ్డు వెళ్లాలంటే భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వార్డులో నెలకొన్న మౌలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో మంచినీరు ప్రతిరోజు వచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, మనుల అరుణ, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎండిఏ ప్లాట్ల పనులో నాణ్యత డొల్ల

**-కమిషనర్ చొరవ చూపాలి**





**మేడిపల్లి మార్చి 11 ప్రభ :** మేడిపల్లి హెచ్ఎండిఏ పాట్లలో కాంట్రాక్టర్ చేస్తున్న యు జి డి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో నాణ్యత మచ్చుకైనా కనిపించడం లేదని హెచ్ఎండిఏ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు ఎంపల్లి పద్మారెడ్డి,హేమంత్ కుమార్ ఆగ్రహించారు. నిర్మాణ పనుల్లో కనీస నిభందనలు పాటించకపోవడంతో ఒకవైపు పనులు జరుగుతుంటే,మరోవైపు పగుళ్లు ఏర్పడుతున్నాయనిఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎండిఏ అధికారి పర్యవేక్షణలో జరగాల్సిన పనులు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని,ఆందోళన వ్యక్తం చేశారు.అదేవిదంగా మ్యానువోల్స్ నిర్మాణాలకు గోనెసంచులు చుట్టి వాటర్ క్యూరింగ్ కూడా చేయడం లేదని, హెచ్ఎండిఏ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి లే అవుట్ ఉనికికే ప్రమాదం ఏర్పడి ప్లాట్ ఓనర్లు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. జూన్ నెల నాటికి పూర్తి కావాల్సిన పనులు 10శాతం పనులు కూడా పూర్తి కాలేదని,నిభందనలకి విరుద్ధంగా పనులు జరగకపోవడంతో పాటు నత్తనడకన సాగుతున్నాయని వెల్ఫేర్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేశారు.

# రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కూన సత్యం గౌడ్



**కూకట్ పల్లి** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూన సత్యం గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూన భరత్ గౌడ్ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూన రవీందర్ గౌడ్, కూన శరత్ గౌడ్, కొడాలి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



**కూకట్‌పల్లి 11,ప్రభ :** భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి కళ్యాణము లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జూపల్లి సత్యనారాయణ

## బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో

# ఎమ్మార్వో గారికి వినతి పత్రం



**ప్రభ,ఎల్లారెడ్డిపేట .** భారతీయ జనతా పార్టీ ఎల్లారెడ్డిపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండలంలో ఇసుక రీచ్లు బంద్ చేయడం వలన మండల గ్రామాల్లో ఇంటి నిర్మాణ పనులు మరియు సిసి వర్కులు సంబంధించినటువంటి ఇసుక పనులు ఆగిపోవడం వలన మండలంలో ఇసుక కొరతతో ఇబ్బందులు గురవుతున్నారు. ఇసుక రీచ్ లను వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఎమ్మార్వో గారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి టౌన్ అధ్యక్షుడు నంది నరేష్ బందరం లక్ష్మారెడ్డి బొమ్మాడి సామి కిరణ్ నాయక్ శ్రీనివాస్ రెడ్డి ఆంజనేయులు ప్రసాద్ రెడ్డి వంగల రాజు రవీందర్ నాయక్ నవీన్ నాయక్ పిట్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

బిజినెస్


# త్వరలో భారత్‌లో ఎలాన్ మస్క్ శాటిలైట్ ఇంటర్నెట్..
# స్పేస్‌ఎక్స్‌తో ఎయిర్‌టెల్ డీల్..!




స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్‌నెట్‌ను భారత్‌కు తీసుకువచ్చేందుకు ఎయిర్‌టెల్ ఎలాన్ మస్క్ కంపెనీ స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ విషయాన్ని ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ పేర్కొంది. దాంతో తమ యూజర్లకు స్టార్‌లింక్ హైస్పీడ్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించనున్నట్లు చెప్పింది. అయితే, స్టార్‌లింక్ శాటిలైట్ కమ్యూనికేసన్ సేవలకు కేంద్రం అనుమతి ఇస్తేనే ఈ ఒప్పందం అమలు ఆధారపడి ఉంటుందని ఎయిర్‌టెల్ వెల్లడించింది. భారత్‌లోని యూజర్లకు స్టార్‌లింక్ సేవలను అందించేందుకు స్పేస్‌ఎక్స్‌తో కలిసి పని చేయడం ఓ కీలకమైన మైలురాయని, తర్వాతి తరం శాటిలైట్ కనెక్టివిటీని యూజర్లకు అందించాలనే తమ నిబద్ధతకు ఇది తార్కాణమని ఎయిర్‌టెల్ ఎండీ, వైస్ చైర్మన్ గోపాల్ విట్టల్ పేర్కొన్నారు. స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం నేపథ్యంలో భారత్‌లోని మారుమూల ప్రాంతాలకు సైతం హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించే సామర్థ్యం ఎయిర్‌టెల్‌కు కలుగుతుంది. దాంతో ప్రతి వ్యక్తికి, వ్యాపారాలకు, కమ్యూనిటీలకు వేగవంతమైన ఇంటర్నెట్ లభిస్తుంది. ఒప్పందం మేరకు ఎయిర్‌టెల్ రిటైల్ స్టోర్స్‌లో స్టార్‌లింక్ పరికరాలు అందుబాటులోకి ఉంటాయి. ఎయిర్‌టెల్ స్టోర్స్‌లో స్టార్‌లింక్ పరికరాలను విక్రయిస్తారు. వాటితో ఎయిర్‌టెల్ వినియోగదారులకు నేరుగా స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందుతాయని విట్టల్ పేర్కొన్నారు. ఎయిర్‌టెల్ ఇప్పటికే శాటిలైట్ ఇంటర్నెట్‌ను అందిస్తోంది. యూటెల్‌సాట్ వన్‌వెబ్‌తో భాగస్వామ్యంతో ఇంటర్నెట్ సేవలను అందిస్తున్నది. తాజాగా స్టార్‌లింక్‌తో ఒప్పందం నేపథ్యంలో మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ కవరేజ్ విస్తరించనున్నది.


# షియోమీ నుంచి 15 సిరీస్ ఫోన్ల ఆవిష్కరణ..

## ఇవీ ఫీచర్లు.. స్పెషిఫికేషన్లు..!




ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ షియోమీ తన షియోమీ 15 సిరీస్ ఫోన్లను మంగళవారం భారత్ మార్కెట్‌లో ఆవిష్కరించింది. ఇందులో షియోమీ 15 , షియోమీ 15 అల్ట్రా ఫోన్లు ఉన్నాయి. ఈ రెండు ఫోన్లు స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్‌పై నడుస్తాయి. లైకా బ్యాక్డ్ రేర్ కెమెరా మాడ్యూల్స్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 32- మెగా పిక్సెల్ కెమెరాలు ఉంటాయి. ఈ ఫోన్లు హైపర్ ఓఎస్ 2.0 స్కిన్‌తో ఆండ్రాయిడ్ 15 పై పని చేస్తాయి. షియోమీ 15 అల్ట్రా ఫోన్‌ను గత ఫిబ్రవరిలో, షియోమీ 15 ప్రోతోపాటు షియోమీ 15 ఫోన్లను గత అక్టోబర్‌లో చైనా మార్కెట్‌లో ఆవిష్కరించింది.షియోమీ 15, షియోమీ 15 అల్ట్రా ధర ఇలా.. షియోమీ 15 అల్ట్రా ఫోన్ 16జీబీ ర్యామ్ విత్ 512జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.1,09,999 పలుకుతుంది. ఐసీఐసీఐ బ్యాంక్ డెబిట్ లేదా క్రెడిట్ కార్డుపై ప్రీ-బుకింగ్స్ నమోదు చేసుకున్న వారికి ఫ్రీ ఫోటోగ్రఫీ కిట్ లెజెండ్ ఎడిషన్, రూ.10 వేలు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. షియోమీ 15 అల్ట్రా ఫోటోగ్రఫీ కిట్ లెజెండ్ ఎడిషన్‌లో యూఎస్బీ టైప్-సీ కెమెరా గ్రిప్, 2000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ, డిటాచబుల్ షట్టర్ బటన్ ఉంటాయి. షియోమీ 15 ఫోన్ 12జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ. 64,999 లకు లభిస్తుంది. ఐసీఐసీఐ బ్యాంకు కార్డులపై ప్రీ-బుకింగ్ చేసుకున్న వారికి రూ.5,000 ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌తోపాటు రూ.5,999 విలువైన ఫ్రీ షియోమీ కేర్ ప్లాన్ బెనిఫిట్లు లభిస్తాయి. రెండు ఫోన్లు కూడా ఈ నెల 19 నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకూ ప్రీ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ నెల 11 నుంచి భారత్ మార్కెట్‌లో లభిస్తాయి. అమెజాన్, షియోమీ ఇండియా ఈ-స్టోర్, సెలెక్టెడ్ రిటైల్ స్టోర్లలో సేల్స్ ప్రారంభం అవుతాయి. షియోమీ 15 ఫోన్ బ్లాక్, గ్రీన్, వైట్ కలర్స్, షియోమీ 15 అల్ట్రా ఫోన్ సిల్వర్ క్రోమ్ కలర్ ఆప్షన్‌లో అందుబాటులో ఉంటుంది.

# ట్రిలియన్ డాలర్లు ఆవిరి..
# అమెరికా మార్కెట్ కుదేలు



ట్రంప్ ఇచ్చిన షాక్‌తో ఇన్వెస్టర్లు భయపడ్డారు. దీంతో వాళ్లు మార్కెట్ షేర్లను అమ్మేసుకున్నారు. సోమవారం వాల్ స్ట్రీట్‌లో సుమారు నాలుగు ట్రిలియన్ల డాలర్ల నష్టం జరిగింది. యూఎస్ స్టాక్ మార్కెట్ల నుంచి 4 ట్రిలియన్ డాలర్లు ఆవిరైపోయాయి. ట్రంప్ ఆర్థిక విధానాల వల్ల మార్కెట్లు షేక్ అవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. వాల్ స్ట్రీట్‌కు చెందిన అన్ని ప్రధాన ఇండెక్స్‌లు సోమవారం ట్రేడింగ్‌లో వడిదిడుకులు ఎదుర్కొన్నాయి.డౌ, ఎస్ అండ్ పీ 500, నాక్‌డాక్ మార్కెట్లు .. తీవ్ర వత్తిడికి లోనయ్యాయి. డౌ ఇండెక్స్ ట్రేడింగ్‌లో సుమారు 890 పాయింట్లు తక్కువ వద్ద ముగిసింది. ఇక ఎస్ అండ్ పీ 500.. 2.7 శాతం తక్కువ ట్రేడ్ అయ్యింది. టెకీ కంపెనీలు ఉండే నాస్‌డాక్ 4 శాతం నష్టపోయినట్లు తెలుస్తోంది. నవంబర్‌లో దేశాధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైన నాటి నుంచి అమెరికా మార్కెట్లు డౌన్ అవుతూనే వస్తున్నాయి.

# జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ ఉచితం!!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ ఎడిషన్ ఈ నెల మూడో వారంలో, 2025 మార్చి 22 నుంచి ప్రారంభం అవుతుంది. ఇప్పటి వరకు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ? మజాను ఆస్వాదించిన క్రికెట్ ప్రియులు, ఇప్పుడు ఐపీఎల్ కొత్త సీజన్‌పై దృష్టి పెట్టారు. క్రికెట్ అభిమానుల కోసం, ముకేష్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో 100 రూపాయల రీఛార్జ్ ప్లాన్‌ను పరిచయం చేసింది. కొన్నాళ్ల క్రితం లాంచ్ అయిన ఈ కొత్త ప్లాన్ "డేటా ఓన్లీ" రీఛార్జ్ ప్యాక్. దీనిలో 100 రూపాయల రీఛార్జ్‌తో మీకు 5 జీబీ డేటా, 90 రోజుల జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ ? లభిస్తుంది. డేటా ప్రయోజనాలతో కూడిన ఈ ప్యాక్ ప్రస్తుతం జియో రీఛార్జ్ ప్లాట్‌ఫామ్ లో అందుబాటులో ఉంది. జియో సినిమా డిస్నీ హాట్‌స్టార్ విలీనం తర్వాత, రిలయన్స్ జియో తన అన్ని రీఛార్జ్ ప్లాన్‌ల నుంచి బేసిక్ జియో సినిమా బెనిఫిట్‌ను తొలగించింది. ఈ నేపథ్యంలో, మార్చి 22 నుంచి ప్రారంభమయ్యే 18వ సీజన్ ఫీవర్‌ను మీరు మిస్ కాకూడదు అనుకుంటే జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాలి. ఈ ప్యాక్ తీసుకుంటే 90 రోజులు చెల్లుబాటు గడువు ఉంటుంది. దీనిలో యూజర్‌కు మొత్తం 5 జీబీ హై స్పీడ్ ఇంటర్నెట్ లభిస్తుంది. 5 జీబీ పరిమితి అయిపోయిన తర్వాత కూడా డేటా అందుబాటులో ఉంటుంది. కాకపోతే, అప్పుడు ఇంటర్నెట్ వేగం 64 కేబీపీఎస్ కు పరిమితం అవుతుంది. జియో 100 రూపాయల ప్రీపెయిడ్ ప్లాన్‌ను బడ్జెట్ ఫ్రెండ్లీ ప్లాన్ అని చెప్పుకోవచ్చు. దీని ద్వారా మీరు స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ టీవీలో 1080p రిజల్యూషన్‌లో 90 రోజుల పాటు కంటెంట్ చూడవచ్చు. ఇది అభిమానులకు బెస్ట్ ఆప్షన్ అవుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, దీనిలో కాలింగ్ లేదా ఎస్ఎంఎస్ సౌకర్యం ఉండదు. జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో కూడిన ఈ కొత్త 'డేటా ఓన్లీ ప్యాక్'ను యాక్టివేట్ చేయడానికి, వినియోగదారులు బేస్ ప్లాన్ తీసుకోవాలి లేదా మీ ఫోన్‌లో ఇప్పటికే ఉండాలి. ఐపీఎల్ ప్రియుల కోసం మరో రెగ్యులర్ ప్లాన్ కూడాలో లిస్ట్ అయి ఉంది, దానిలోనూ జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ పొందొచ్చు. ఆ ప్లాన్ ధర 149 రూపాయలు, 90 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. దీనిలో కంటెంట్‌ను కేవలం ఒక్క పరికరంలో మాత్రమే చూడగలరు. ఇది ప్రీమియం ప్లాన్ కాదు కాబట్టి ప్రకటనలు కూడా ఉంటాయి. అయితే, 100 రూపాయల ప్లాన్‌లో, వినియోగదారులు స్మార్ట్‌ఫోన్ & స్మార్ట్‌టీవీ రెండింటిలోనూ మ్యాచ్‌లను చూడొచ్చు. ఇంకా, జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న వెబ్ సిరీస్‌లు, సినిమాలను కూడా 1080పీ రిజల్యూషన్‌లో వీక్షించవచ్చు. దీనితో పోలిస్తే, జియో హాట్‌స్టార్ సూపర్ ప్లాన్‌కు సమానమైన స్టాండ్ ఎలోన్ రీఛార్జ్ ప్లాన్ మరొకటి ఉంది, దాని ధర 299 రూపాయలు.

# రిషబ్ పంత్ ఇంట్లో వివాహ వేడుకలు..



టీమిండియా స్టార్ క్రికెటర్లు ఉత్తరాఖండ్ లోని ముస్సోరీలో వికెట్ కీపర్-బ్యాటర్ రిషబ్ పంత్ సోదరి సాక్షి పంత్ వివాహానికి హాజరుకానున్నట్లు తెలుస్తోంది. రిషబ్ పంత్ సోదరి వివాహ వేడుకలు మంగళవారం, బుధవారం ముస్సోరీని ఓ ప్రాంతంలో జరగనున్నట్లు తెలిసింది. ఈ వివాహానికి భారత కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని హాజరుకానున్నారు. రిషబ్ సోదరి సాక్షి పంత్ వ్యాపారవేత్త అంకిత్ చౌదరిని వివాహం చేసుకోబోతోంది. దాదాపు తొమ్మిది సంవత్సరాలు డేటింగ్ చేసిన తర్వాత వీరిద్దరూ గత సంవత్సరం నిశ్చితార్థం చేసుకున్నారు. 2024 జనవరిలో లండన్ లో జరిగిన ఈ జంట నిశ్చితార్థ వేడుకకు భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని కూడా హాజరయ్యారు. యూకేలో చదువుకున్న సాక్షి పంత్ సోషల్ మీడియాలో భారీగా ఫాలోవర్లను కలిగి ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ విజేత అయిన భారత జట్టులో రిషబ్ పంత్ సభ్యుడిగా ఉన్నాడు. భారత్ ఫైనల్లో న్యూజిలాండ్ ను ఓడించి మూడోసారి టైటిల్ ను గెలుచుకుంది. డిసెంబర్ 2022లో ఈ వికెట్ కీపర్-బ్యాటర్ ఒక ఘోర కారు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. అనేక శస్త్రచికిత్సలు, సుదీర్ఘ కాలం తర్వాత క్రికెట్ లోకి తిరిగివచ్చాడు. భారత్ టీ-20 ప్రపంచ కప్ గెలవడంలో సహాయం చేశాడు. టెస్టుల్లోకి తిరిగి వచ్చిన తర్వాత సెప్టెంబర్ 2024లో మ్యాచ్ విన్నింగ్ సెంచరీ చేశాడు అత్యధిక టెస్ట్ సెంచరీలు చేసిన భారత వికెట్ కీపర్ గా ధోని రికార్డును సమం చేశాడు. గత నవంబర్‌లో జెడ్డాలో 2025 ఐపీఎల్ మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ రూ.27 కోట్లకు కొనుగోలు చేసిన తర్వాత రిషబ్ పంత్ ఐపీఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ ను కొనుగోలు చేయడానికి పంజాబ్ కింగ్స్ నిర్ణయించిన రూ. 26.75 కోట్ల బిడ్ ను లక్నో అధిగమించింది. మార్చి 22 నుంచి ప్రారంభమయ్యే ఐపీఎల్ 2025లో రిషబ్ పంత్ లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ గా అధికారికంగా ప్రకటించబడిన సంగతి తెలిసిందే.

స్పోర్ట్స్

# నాకు రావాల్సిన గుర్తింపు రావడం లేదు

## టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్



కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) కెప్టెన్‌గా ఐపీఎల్ 2024 సీజన్ టైటిల్ గెలిచినా.. తనకు రావాల్సిన గుర్తింపు రాలేదని టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. అయినా తాను హార్డ్ వర్క్‌ను కొనసాగించానని తెలిపాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోనే కేకేఆర్ టైటిల్ గెలిచింది. శ్రేయస్ అయ్యర్ కంటే ఆ జట్టు మెంటార్‌గా గౌతమ్ గంభీర్‌కే ఎక్కువ గుర్తింపు లభించింది.కెప్టెన్‌గా టైటిల్ అందించినా.. శ్రేయస్ అయ్యర్‌ను కేకేఆర్ రిటైన్ చేసుకోలేదు. దాంతో అతను ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి రాగా.. పంజాబ్ కింగ్స్ రూ. 26.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసి తమ కెప్టెన్‌గా నియమించింది. తాజాగా జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో శ్రేయస్ అయ్యర్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. అసాధారణ బ్యాటింగ్‌తో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. 5 మ్యాచ్‌ల్లో 243 పరుగులు చేశాడు. మిడిలార్డర్‌లో అక్షర్ పటేల్, విరాట్ కోహ్లీలతో కలిసి కీలక భాగస్వామ్యాలను నమోదు చేశాడు. %జ%ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో రాణించడం చాలా సంతృప్తినిచ్చింది. నిజం చెప్పాలంటే.. ఇదో ఒక ప్రయాణం. నా జీవితంలోని ఈ దశలో నేను చాలా నేర్చుకున్నాను. వన్డే ప్రపంచకప్ 2023 అనంతరం నేను బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయాను. దాంతో నేను ఎక్కడ తప్పు చేశాను? ఏమి చేయాలా? నా ఫిట్‌నెస్ ఎంత మెరుగుపర్చుకోవాలి? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఒక టైమ్ టేబుల్ సిద్ధం చేసుకొని నా శిక్షణను కొనసాగించాను. నేను మెరుగుపరుచుకోవాల్సిన నైపుణ్యాలపై ఫోకస్ పెట్టాను. దేశవాళీ క్రికెట్‌లో వరుసగా మ్యాచ్‌లు ఆడిన తర్వాత ఫిట్‌నెస్ మెరుగుపరుచుకోవడం ఎంత ముఖ్యమో నాకు తెలుసొచ్చింది. ఈ ఏడాది ఆరంభంలోనే నా సమస్యలను గుర్తించాను. ఈ విషమ దశ నుంచి నేను బయటపడిన విధానం, ఈ పరిస్థితులను నేను హ్యాండిల్ చేసిన తీరు.. మరీ ముఖ్యంగా నన్ను నేను నమ్ముకోవడం చాలా సంతోషాన్నిచ్చింది.'అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు.



# కుర్ర హీరోయిన్స్‌కు గుబులు పుట్టిస్తున్న హరితేజ..

## -చూస్తే ఫిదా అవ్వాల్సిందే.

తెలుగు ప్రేక్షకులకు హరితేజ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. సీరియల్స్ ద్వారా మంచి క్రేజ్ తెచ్చుకున్న ఈమె.. పలు టీవీషోలో కనిపించి మెప్పించింది. అలాగే సినిమాలతో పాటు బిగ్ బాస్ గేమ్ షోలోనూ కనిపించి ఆకట్టుకుంది. మనసు మమత, రక్త సంబంధం, అభిషేకం, తాళి కట్టు శుభవేళ, శివరంజని, కన్యాదానం ఇలా పలు సీరియల్స్ లో నటించింది హరితేజ. అలాగే సినిమాల్లోనూ చక్కటి పాత్రలు చేసి మెప్పించింది. ముఖ్యంగా అ ఆ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన అఆ సినిమాతో వెండితెర పై మంచి గుర్తింపు తెచ్చుకుంది హరితేజ. ఈ సినిమాలో హీరోయిన్ సమంత పనిమనిషిగా నటించింది. అలాగే తన కామెడీ టైమింగ్ తో ఆకట్టుకుంది హరితేజ.ఇక ఆతర్వాత ఎన్టీఆర్ హెూస్ట్ గా వ్యవహరించిన బిగ్ బాస్ సీజన్ 1 లో కంటెస్టెంట్ గా పాల్గొంది. బిగ్ బాస్ లో తన ఆటతో పాటు అల్లరితో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఆ క్రేజ్ తోనే ఆతర్వాత కొన్ని సినిమాల్లో అవకాశాలు అందుకుంది.ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. అలాగే బిగ్ బాస్ సీజన్ 8లోనూ పాల్గొంది హరితేజ. కాగా ఇప్పుడు సినిమాలతో పాటు సోషల్ మీడియాలో ఎక్కువగా యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది. అంతే కాదు ఈ అమ్మడు గ్లామర్ గేట్లు ఎత్తేసి అందాలతో ఆకట్టుకుంటుంది.




# రికార్డులు సృష్టిస్తున్న ఛావా

## బాహుబలి-2 కలెక్షన్లను అధిగమించి వసూళ్లు

విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకక్కిన 'ఛావా'రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటికే బీటౌన్‌లో ఎన్నో రికార్డులు తన ఖాతాలో వేసుకోగా.. తాజాగా మరో మైలురాయిని చేరుకుంది. సినీ ఇండస్ట్రీలో చరిత్ర సృష్టించిన 'బాహుబలి 2' రికార్డును అధిగమించింది. దీంతో విక్కీ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'బాహుబలి 2' అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినిమాకు గుర్తింపుతెచ్చింది. దేశవ్యాప్తంగానూ విడుదలైన అన్ని ప్రాంతాల్లో భారీ వసూళ్లు సొంతం చేసుకుంది. హిందీలో ఈ చిత్రం రూ.510 కోట్లు వసూళ్లు రాబట్టింది. ఇప్పుడీ కలెక్షన్లను 'ఛావా' అధిగమించింది. ఫిబ్రవరి 14న విడుదలైన 'ఛావా' ఇప్పటివరకూ బీ టౌన్‌లో రూ.516 కోట్లు వసూళ్లు చేసింది. దీంతో 25 రోజుల్లోనే బాలీవుడ్‌లో 'బాహుబలి 2' రికార్డును అధిగమించి చరిత్ర సృష్టించింది. అంతేకాదు హిందీ చలనచిత్ర చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన ఆరో సినిమాగా 'ఛావా' నిలిచింది. మరోవైపు ఈ సినిమా ఓటీటీ విడుదల గురించి సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీని డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. థియేటర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఏప్రిల్ 11 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు వార్తలు వస్తున్నాయి . త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుందంటూ పోస్ట్‌లు షేర్ అవుతున్నాయి. ఈ చిత్రం ఓటీటీ విడుదలయ్యాక అక్కడ కూడా రికార్డులు నెలకొల్పడం ఖాయంగా కనిపిస్తోంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్ ఆయన భార్య యేసుబాయి భోంస్లే పాత్రలో రష్మిక జీవించేశారు.



# సమంతతో మరోమారు నందిని మూవీ

స్టార్ బ్యూటీ సమంత, టాలీవుడ్ స్టార్ దర్శకురాలు నందినిరెడ్డితో మళ్లీ చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన జబర్దస్త్, ఓ బేబీ చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ జోడీ మళ్లీ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో రాబోతున్నట్లు తెలుస్తోంది. సమంత సొంత ప్రోడక్షన్ అయిన ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉందని సమాచారం. ఈ సినిమా రీమేక్ కాకుండా ఒరిజినల్ స్క్రిప్ట్‌తో రూపొందనుందని నందిని రెడ్డి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పుకోచ్చింది. కాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ÷నిమాల విషయానికి వస్తే.. గతేడాది సిటాడెల్: హనీ బన్నీ అనే వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది సామ్. స్పై థ్రిల్లర్‌గా వచ్చిన ఈ వెబ్ సిరీస్‌లో వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటించాడు. రాజ్ అండ్ డీకే ఈ వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహించగా.. కే కే మీనన్, సికందర్ ఖేర్, సాకిబ్ సలీం తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. ఈ సిరీస్ ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది.



# నీ నుండి ఇలాంటివి ఊహించలేదు..

## శేఖర్ మాస్టర్‌ని దుమ్మెత్తిపోస్తున్న నెటిజన్స్

టాలీవుడ్ బెస్ట్ కొరియోగ్రాఫర్స్‌లలో శేఖర్ మాస్టర్ తప్పక ఉంటారు. ఎంతో కష్టపడి ఆయన ఈ స్థాయికి వచ్చారు. గ్రూప్ డ్యాన్సర్లలో ఒకరిగా అతి సాధారణ స్థాయి నుంచి కెరీర్ ప్రారంభించి ఇప్పుడు స్టార్ హీరోల సినిమాలకు కొరియోగ్రఫి చేస్తున్న శేఖర్ మాస్టర్ కొందరు హీరోలకి ఫేవరేట్ డ్యాన్స్ మాస్టర్. ఇప్పుడు ఆయన సినిమాలతో పాటు బుల్లితెరపైనా పలు షోలకు జడ్జిగా చేస్తూ రెండు చోట్లా తన మార్క్ చూపిస్తున్నారు. కెరీర్‌లో ఎన్నో అవమానాలు, చీత్కారాలు, తినడానికి తిండి లేక ఎన్నో ఇబ్బందులు పడ్డ శేఖర్ మాస్టర్ ఇప్పుడు ఉన్నత స్థాయిలో ఉన్నాడు.ఒకప్పుడు 75 రూపాయలు ఇస్తే తనకు రూ.కోటి దొరికినంత ఆనందం కలిగేదని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు శేఖర్ మాస్టర్ . తనకు డ్యాన్స్ , సినిమా తప్పించి ఏం తెలియదని ఎన్నోసార్లు ఎడిపించారు శేఖర్ మాస్టర్. అయితే క్రియేటివిటీ పేరుతో ఐటెం సాంగ్స్, స్పెషల్ డ్యాన్స్ నెంబర్స్ , రొమాంటిక్ డ్యూయెట్స్ ను దిగజారుస్తున్నారను. మిస్టర్ బచ్చన్ సినిమాలోని పాటకే శేఖర్ మాస్టర్ , హరీష్ శంకర్ ను దారుణంగా ట్రోల్ చేశారు జనాలు. అయితే సినిమా వరకు ట్రోలింగ్ మొత్తం హరీష్ శంకర్ మీదకు మళ్లిపోయింది. ఇప్పుడు రాబిన్ హుడ్ పాట విషయంలో శేఖర్ మాస్టర్‌ని దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. చిత్రంలో 'అదిదా సర్‌ప్రైజు' అనే పాట కేతిక వర్మపై తెరకెక్కించగా, అందులో స్టెప్పులు మంచి క్రేజీ ఉన్నాయి. కేతిక కూడా హుషారుగా చిందులేసింది. అయితే.. ఓ హుక్ స్టెప్ మాత్రం విమర్శలకు తావిచ్చింది. అమ్మాయిలతో ఇలాంటి స్టెప్పులు వేయిస్తున్నప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. అది ఐటెమ్ పాటే అయ్యి ఉండొచ్చు . కాని హద్దులు మీరకూడదు అని అంటున్నారు. కేతిక వేసుకున్న కాస్ట్యూమ్ కి ఆ స్టెప్.. ఊర్లలో జాతర్లప్పుడు ట్రాక్టర్ల మీద వేసే స్టెప్పులను తలపించింది. స్కర్ట్ లేపే ఈ స్టెప్పులకి అందరు శేఖర్ మాస్టర్‌ని తిట్టిపోస్తున్నారు. సినిమాకి ఇది ఎఫెక్ట్ పడుతుందేమో అని నితిన్‌ని హెచ్చరిస్తున్నారు. మొన్నామధ్య వచ్చిన "డాకు మహారాజ్" సినిమాలోని "దబిడి దిబిడి" సాంగ్ కి కూడా శేఖర్ మాస్టర్‌ని విమర్శించిన విషయం తెలిసిందే.

Edited, printed and owned by **BHIROJU KISHORE CHARY,**printed at **SHIVA KESHAVA PRINTERS** ,FLAT NO .30, BLOCK NO.8, RAJEEVHEELS JAGATH-GIRIGUTTA QUTHBULLAPUR, MEDCHAL,(MALKAJGIRI)editor BHIROJU KISHORE CHARY,RNI Regn No TELTEL 2021/81472